క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99631 70177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి కడప రోడ్డు ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ముద్దనూరు సాంకేతిక వ్యవసాయాధికాకరి మధుసూదన్‌రెడ్డి

సింహాద్రిపురం : రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ముద్దనూరు సాంకేతిక వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్టాక్ రిజిష్టర్లను, బిల్లులను తప్పనిసరిగా మెయింటెన్స్ చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొన్న రైతులకు బిల్లులను కచ్చితంగా ఇవ్వాలన్నారు. రైతు సేవా కేంద్ర సిబ్బందికి తప్పనిసరిగా ప్రతి రైతుకు అందుబాటులో ఉండాలని, వివిధ ప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏవో కళ్యాణ్, మండల ఎరువు దుకాణ యాజమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

చింతకొమ్మదిన్నె. మండలంలోని మద్దిమడుగు గ్రామ సమీపంలో కడప – చిత్తూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు సాంబశివకు తీవ్ర గాయాలయ్యాయి. గువ్వలచెరువు కొత్త రోడ్డు ప్రాంతానికి చెందిన సాంబశివ కడపలో పని ముగించుకుని తన ఇంటికి తిరిగి బైక్ పై వెళ్తూ ఉండగా మద్దిమడుగు సమీపంలోకి రాగానే గువ్వలచెరువు వైపు నుంచి వస్తున్న బొలెరో (ఏపీ39యూఎఫ్5492)వాహనం ఢీకొంది. సాంబశివ కాలు చేతులకు తీవ్ర గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు. అంబులెన్స్ ద్వారా బాధితుడిని చికిత్స కొరకు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

తపాలా కార్యాలయాల్లో సేవలు నిలుపుదల

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు తపాలా డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు తాత్కాలికంగా అన్ని రకాల సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రొద్దుటూరు డివిజన్ సూపరింటెండెంట్ జి.కిరణ్ తెలిపారు. గురువారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తపాలా ఆధునీకరణలో భాగంగా అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 ద్వారా వినియోగదారులు సెల్‌ఫోన్ ద్వారా తపాలా సేవలను సులభంగా పొందే సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త విధానం అమలుకు సన్నాహక చర్యలో భాగంగా ప్రొద్దుటూరు, పులివెందుల హెడ్ పోస్టాఫీసులతోపాటు డివిజన్‌లోని 49 సబ్ పోస్టాఫీసులు, 325 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో అన్ని లావాదేవీలను తాత్కాలికంగా నిలిపిస్తున్నట్లు వివరించారు. ఈ సమయంలో సాంకేతిక నవీకరణలు, సిస్టం మరమ్మతులు, సిబ్బందికి శిక్షణను చేపట్టనున్నట్లు తెలిపారు. తపాలాశాఖ డాక్ సేవా మొబైల్ యాప్ ద్వారా బ్యాంకింగ్, బీమా, ఉత్తరాల బట్వాడా, ఇతర లావాదేవీలను రియల్ టైం ట్రాకింగ్ సౌకర్యంతో వినియోగదారులు సులభంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. తమ సెల్‌ఫోన్ల ద్వారా తపాలా సేవలను వేగంగా, సురక్షితంగా పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు వినియోగదారులు సమీప తపాలా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని లేదా తపాలా శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు అని సూచించారు.

రామచంద్రాయపల్లెలో నీటి ఎద్దడి

మైలవరం : మండల పరిధిలోని రామచంద్రాయపల్లెలో నీటి ఎద్దడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. నెలరోజులుగా నీటి కొతర కారణంగా కులాయిలకు నీరు రాకపోవడంతో ప్రజలు నానాయాతన పడుతున్నామంటూ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో గురువారం ఎంపీడీఓ రామచంద్రారెడ్డితో ఎమ్మెల్సీ మాట్లాడి సమస్యను త్వరితగతిన పూర్తి చేయాలని నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకపోవడం సరైంది కాదని సూచించారు. ఆదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్‌కు కూడా ఫోన్‌లో నీటి సమస్య గురించి తెలిపారు. దీంతో ఎంపీడీఓ తన సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి నీటి సమస్య గురించి ఆరాతీశారు. ప్రస్తుతం ఉన్న మోటర్లకు నీరు అందకపోవడంతో నీటి కొరత ఎర్పడింది. సరైన వర్షాలు రాకపోవడం వల్ల నీరు బోరు బావులకు అందడంలేదని కొత్తగా బోరు వేసినప్పటికి నీరు పడలేదన్నారు. మళ్లి బోరువేసేటందుకు సిద్ధపడుతున్నామని సాధ్యమైనంత త్వరగా నీటి సమస్య పరిష్కారం చేస్తామని ఎంపీడీఓ ప్రజలకు తెలిపారు. అలా లేని పక్షంలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



నీటి సమస్యపై ఎమ్మెల్సీకి వివరిస్తున్న ప్రజలు



నీటి కోసం క్యూలో పెట్టిన బిందేలు

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కమలాపురం : రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కామనూరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్ నందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాయకుడు రవీంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగానే ఏపీ ప్రభుత్వం కూడా విద్యుత్ కార్మికులకు కోటి రుపాయల ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. 2022 అరియర్స్‌ను ఉద్యోగులకు ఇచ్చిన తరహాలోనే కార్మికులకు కూడా తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 20, 25 ఏళ్లుగా పనిచేస్తున్నటు వంటి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. అలాగే కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లందరిని స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని, అలాగే అనారోగ్యం పాలైన, ప్రమాదాలకు గురైన



విద్యుత్ కార్మికులతో కలసి మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులరెడ్డి

విద్యుత్ కార్మికులకు అన్‌లిమిటెడ్ హెల్త్ కార్డులను జారీ చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలను పలు మార్లు ప్రభుత్వం దృష్టికి, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేక పోవడంతో ఆగస్టు 7వ తేదీన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఛలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జరప తలపెట్టామని, జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వేతనాలివ్వకపోతే ఆందోళన తప్పదు

కమలాపురం : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల్వికపోతే ఆందోళన చేస్తామని ఏఐటీయూసీ, సీపీఐ ఏరియా కార్యదర్శులు పి.చంద్రశేఖర్, నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వారు మున్సిపల్ కార్మికులతో మాట్లాడారు. మూడు నెలలుగా జీతాలందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణం జీతాలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం మున్సిపాలిటీలో 30 మంది కార్మికులు పనిచేస్తున్నారని, మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వారు ఎలా జీవనం సాగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు లేక పోతే స్వీపర్లతోనే ట్రాక్టర్లు నడిపిస్తున్నారని, 10–12 గంటలు పని చేస్తూ, వెట్టి చాకిరి చేయిస్తూ జీతాలు ఇవ్వక పోతే ఎలా? అని వారు ప్రశ్నించారు. జీతాలు ఇవ్వలేదం లేదనే విషయాలు బయట చెబితే మిమ్మల్ను తీసేస్తామని అధికారులు బెదిరించడం సరికాదని, అధికారులు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. పారిశుద్ధ్య కార్మికులు జీతాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని వారు హెచ్చరించారు. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న స్వీపర్, వాటర్‌మాన్, డ్రైవర్, అటెండర్ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు తక్షణం న్యాయం చేయక పోతే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

కార్మిక సమస్యలను పరిష్కరించాలి



ఆర్టీపీపీ గేటు వద్ద చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

జమ్మలమడుగు : విద్యుత్ కార్మిక సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే పోరుబాట తప్పదని ఏపీ విద్యుత్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య తెలిపారు. గురువారం ఆర్టీపీపీ గేట్ వద్ద ఈనెల 21వ తేదీన విద్యుత్ సమస్యలపై చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో ఎన్నో సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మూడో వ్యక్తితో ప్రమేయం లేకుండా వీరికి జీతాలు నేరుగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జెన్కో కార్యదర్శి గంగాధర్, బాషా, ఓబులేసు, బాలసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దువ్వూరు : ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజామొయినుద్దీన్ తెలిపారు. మండలంలోని కృష్ణంపల్లెలో గురువారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలు అందుబాటులో ఉన్న న్యాయ చట్టాలను తెలుసుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కృష్ణంపల్లె గ్రామాన్ని దత్తత తీకున్నట్లు తెలిపారు. ప్రజలకు చట్టాల గురించి తెలిపి సత్వర న్యాయం అందించడమే న్యాయవిజ్ఞాన సదస్సు లక్ష్యం అన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరికి చట్టాలు ఉంటాయని వాటిని తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్ల నిండకముందే ఆడ పిల్లలకు వివాహం చేయడం నేరమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై అవగాహన అవసరమని, ఈకేసుల్లో వారికి ఉచిత న్యాయ సహాయంతోపాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతున్నారు. ప్రజలు సత్వర న్యాయం పొందేందుకు చట్టాలను వినియోగించుకోవాలన్నారు. సుప్రీం కోర్టు కక్షిదారుల మధ్య కేసులను త్వరగా పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కక్షిదారుల కేసులను పరిష్కరించేందుకు న్యావాదులకు ఈ అంశంపై శిక్షణ ఇచ్చామన్నారు. చట్టపరంగా ఎవరికైనా న్యాయం కావాలంటే తమను సంప్రదించాలని, ప్రభుత్వం ఉచితంగా న్యాయం పొందే అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ రెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఏజీపీ జ్వాలా నరసింహా, ప్యానల్ లాయర్లు సోమేశుల శివరామకృష్ణ, ఎస్.శ్రీనివాసులు, న్యాయవాదులు ఇమాంబాషా, కరీముల్లా, అబ్దుల్ వహాబ్, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పవిత్రమైన పాపాఘ్ని నదిని కాపాడండి

చక్రాయపేట : మండలంలో పాపాఘ్ని నది తీర ప్రాంతాలు ఆక్రమణకు గురవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం చక్రాయపేట రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ విజయలక్ష్మికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు నుంచి వేంపల్లె వరకు పాపాఘ్ని నదిలో కొందరు ఆక్రమంగా పంటలు సాగు చేస్తున్నారని, పాపాఘ్ని నది కుంటలా కనిపిస్తోందన్నారు. గతంలో కూడా ఈ నది ఆక్రమణకు గురైందని, అప్పట్లో వరదల కారణంగా నదీ తీర ప్రాంతాలు కొట్టుకుపోయాయని, తిరిగి కొందరు అక్రమార్కులు నదిలో పంటలు సాగు చేస్తున్నారన్నారు. పంటలకు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడటంవల్ల స్వచ్ఛమైన పాపాఘ్ని నది కలుషితమవుతోందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకుని నదిని కాపాడాలన్నారు. లేనిపక్షంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తానన్నారు.

డిప్లొమా ఓరియంటేషన్ సదస్సు

చింతకొమ్మదిన్నె : రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమాలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ సదస్సు గురువారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిప్లమా కోర్సు ఒక వారధి లాగా ఉపయోగపడుతుందన్నారు. కష్టపడి చదివి తమ ఆశలను, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డిప్లమా ఇన్‌చార్జి డాక్టర్ ఎం.మురళీమోహన్ నాయక్, కళాశాల హెచ్‌అండ్ఎస్. విభాగాధిపతి డాక్టర్ శశికుమార్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మురళీకృష్ణ, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు

విభజన హామీల అమలేదీ..?

కడప వైఎస్ఆర్ సర్కిల్: విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, రాయలసీమకు ప్యాకేజీ వంటి డిమాండ్లతో శుక్రవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు కడప నాయకులు వెళ్లారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి విభజన హామీలు మరచిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కడప ఉక్కు కు నిధులు లేవు, వెనుకబడిన రాయలసీమ కు ప్యాకేజీ లేదు, ఉపాధి పరిశ్రమల ఏర్పాటు లేదన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు.

రామ్‌గోపాల్‌రెడ్డి.. సతీష్‌రెడ్డిని విమర్శించేస్థాయి నీకు లేదు

• వైఎస్సార్‌సీపీ నాయకుడు హేమాద్రిరెడ్డి



పులివెందుల : రాంగోపాల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డిపైన చేసిన ఆరోపణలు సరైంది కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు హేమాద్రి రెడ్డి తెలిపారు. సతీష్‌రెడ్డికి లోకేష్‌ను విమర్శించే స్థాయి లేదనడం పద్ధతి కాదన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు హేమాద్రిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ స్థాయి, చంద్రబాబు స్థాయి 2 ఎకరాల నుంచి వచ్చిందన్నారు. సతీష్‌రెడ్డి వాళ్ల అబ్బ కాలం నుంచి జమీందారులన్నారు. సతీష్‌రెడి స్థాయి నీకు కాదు పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి తెలుసునని, తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు తెలుసు అని తెలిపారు. 1995 నుంచి తెలుగుదేశం పార్టీలో ఉన్నారని, 2020లో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారని, ఆ రోజు వరకు తెలుగుదేశం పార్టీకి చాలా నీతిగా, నిజాయతీగా చిత్తశుద్ధిగా పనిచేశారన్నారు. రెండు నెలల క్రితం సమావేశంలో నీపైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత సమక్షంలో కోవర్టు నాయకులంతా తెలుగుదేశం పార్టీలో ఉన్నారని చెప్పి, నీపైన దాడి జరిగిన విషయాన్ని మరిచి పోయావా రాంగోపాల్ ఆ విషయాన్ని నీవు గుర్తు పెట్టుకో అన్నారు. అలిరెడ్డిపల్లె బ్రిడ్జి ప్రధానమంత్రి యోజన కింద వస్తే ఏ కాంట్రాక్టర్ ముందుకు రాకుంటే కోట్లాది రూపాయలు నష్టం వచ్చిన ఫర్వాలేదు తువ్వపల్లె, అలిరెడ్డిపల్లె ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో నష్టం వచ్చినా బ్రిడ్జిని నిర్మించిన ఘనత సతీష్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాంగోపాల్‌రెడ్డి అధికారం ఉంది అని మాట్లాడుతున్నావేమో అధికారం వస్తుంది, పోతుంది. సతీష్‌రెడ్డికి లోకేష్‌ను తిడితేనే జగన్‌మోహన్‌రెడ్డి వద్ద గుర్తింపు ఉందనుకుంటున్నావేమో.. జగన్‌మోహన్‌రెడ్డి సతీష్‌రెడ్డికి పార్టీలో ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసు అన్నారు. సతీష్‌రెడ్డి గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు.

ఆర్‌ఎస్‌కేలకు చేరిన యూరియా

వేముల : పంటలకు అవసరమైన యూరియా ఎట్టకేలకు రైతు సేవా కేంద్రాలకు చేరింది. 'యూరియా కోసం రైతుల ఎదురుచూపులు' అనే శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు గురువారం రైతు సేవా కేంద్రాలకు యూరియాను తరలించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ బోర్లు, బావుల కింద వివిధ రకాల పంటలు సాగు చేసుకున్నారు. అదునులో యూరియా వేయాల్సి ఉన్నా రైతు సేవా కేంద్రాలలో, బయట మార్కెట్‌లో దొరకలేదు. దీంతో రైతులు యూరియా కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. డిమాండ్‌ను గుర్తించిన ఎరువుల దుకాణదారులు రసాయనిక ఎరువు బస్తా కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని షరతు పెట్టారు. దీంతో యూరియా కోసం రైతులు రసాయనిక ఎరువుల బస్తాలను కొనుగోలు చేయాల్సి వచ్చింది. సాక్షిలో వచ్చిన కథనంతో జిల్లా అధికారులలో చలనం వచ్చింది. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలకు ఒక లారీ చొప్పున యూరియాను సరఫరా చేయడంతో రైతులు కొంత మేర సమస్య తీరనుంది. ఈ సందర్భంగా ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాలకు యూరియా సరఫరా చేశామని, అవసరమైన రైతులు కేటాయించిన రైతు సేవా కేంద్రాలలో యూరియా తీసుకోవచ్చునన్నారు. వేములలోని చాగలేరు రైతు సేవా కేంద్రంలో 444 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు తీసుకోవాలని ఆయన సూచించారు.



చాగలేరు రైతు సేవా కేంద్రానికి చేరిన యూరియా

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

చింతకొమ్మదిన్నె : సోలార్, గ్రీన్ ఎనర్జీ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని ఈనెల 20వ తేదీన నంద్యాలలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి రైతులను కోరారు. భూసమస్యలపై చింతకొమ్మదిన్నెలో గురువారం కరపత్రాలను రైతు సంఘం నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములను సోలార్, గ్రీన్ ఎనర్జీ పేరుతో లక్షల ఎకరాల వ్యవసాయ భూములను ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నదన్నారు. రైతుల అనుమతి, గ్రామ సభలు నిర్వహించకుండా బలవంతంగా భూ సేకరణ చేయడం చాలా అన్యాయమన్నారు. కార్పొరేట్ కంపెనీలకు భూపందారానికి వ్యతిరేకంగా సామాన్య పేద మధ్యతరగతి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం గురించి చర్చించేందుకు, భవిష్యత్ కార్యచరణ రూపొందించేందుకు ఈనెల 20వ తేదీన నంద్యాలలో జరిగే రాష్ట్ర భూ సదస్సు లో రైతు సోదరులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, చిన్న సిద్దయ్య, స్థానిక మండల రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలను అవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ప్లాస్టిక్ వస్తువులను వాడరాదు

పులివెందుల టౌన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడరాదని వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు నటరాజ్, అబ్దుల్లా షాపుల యజమానులకు సూచించారు. గురువారం పట్టణంలోని పలు షాపులు, హోటళ్లలో వారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ నిషేదిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాదీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడటం నిషేదించిందన్నారు. కిరాణా షాపులు, హోటళ్లల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడరాదని, ప్రజలు కూడా జూట్ బ్యాగ్‌లను, గుడ్డ సంచులను వాడి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కిరాణా షాపును తనిఖీ చేస్తున్న వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కడప వైఎస్ఆర్ సర్కిల్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టెప్ సీఈవో సాయి గ్రేస్ అన్నారు. గురువారం నగర శివార్లలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో నిర్వహించిన అస్మిత లీగ్ పోటీల్లో భాగంగా నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో దాదాపు 48 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం ఉపాధ్యక్షుడు జిలానీ బాష, డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేక అధికారి జగన్నాథ రెడ్డి, కోచ్ లు, ఖేలో ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనులు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలను కలిసికట్టుగా చేసుకుంటేనే విద్యుత్ ప్రమాదాలను నివారించగలమని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో తొండూరు, సింహాద్రిపురం, లింగాల, వేంపల్లె, చక్రాయపేట, వేముల, పులివెందుల మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ రైతుల విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి ఫోన్లకు స్పందించాలని హెచ్చరించారు. కొత్త విద్యుత్ సర్వీసులు విడుదలలో జాప్యం ఉండరాదన్నారు. సోలార్ గ్రూప్ టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. కొత్త విద్యుత్ సర్వీస్‌ల విడుదలలో జాప్యం ఉండరాదన్నారు. ఫిర్యాదులు లేని సేవలను వినియోగదారులకు అందించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని, వినియోగదారులు అంతరాయాలను సహించే పరిస్థితులలో లేరని, లైన్‌లో తిరిగి సమస్యలను గుర్తించి మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టాలన్నారు. అలాగే ట్రాన్స్ ఫార్మర్ల వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, వాటి వలన సంస్థకు నష్టం వాటిల్లడమే కాకుండా వినియోగదారుడికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. వాటి వైఫల్యాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, ఏఈలు, విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో విద్యుత్ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ ఎస్.రమణ

తొండూరులో..

తొండూరు : రైతుల విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. గురువారం మండలంలోని మదూరు ప్రాంతంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించి అనంతరం విద్యుత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు అందించే సేవలు ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, రీకనెక్షన్ వంటివి వినియోగదారులు అసౌకర్యానికి గురికాకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, వీటి వలన సంస్థకు నష్టం వాటిల్లటమే కాకుండా వినియోగదారుడికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయసుధాకర్‌రెడ్డి, ఏఈ బాల సంజీవులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



తొండూరు : మదూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ